క్లుప్తంగా

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కోడూరు: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నట్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

కప్తానుపాలెం(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు శివారు కప్తానుపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్, స్థానిక రేషన్ డీలర్ డోకుపర్తి బాల కోటేశ్వరావు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

గూడూరు: మండలంలోని నారికేడాలపాలెంలో గ్యాస్ సిలెండర్ పేలడంతో జన్ను గోపాలరావుకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో నిరుపేద కుటుంబానికి చెందిన గోపాలరావు కట్టుబట్టలతో మిగిలిలాడు. సమాచారం తెలుసుకున్న బందరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఎడ్లంకకు మళ్లీ వరద



అవనిగడ్డ: దివిసీమకు వరద ఉధృతి మళ్లీ పెరిగింది. వారం రోజుల పాటు వచ్చిన వరద గత మూడు రోజులుగా తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం 4.43లక్షల క్యూసెక్కులు వరద నీరు దిగువకు వదిలారు. దీంతో పులిగడ్డ వద్ద అక్విడెక్టును తాకుతూ వరద ప్రవహిస్తోంది. ఎడ్లంక వెళ్లే రహదారి పూర్తిగా వరద నీటిలో మునిగిపోవడంతో ఈ ప్రాంతవాసులు పడవ ప్రయాణం సాగిస్తున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కోడూరు: మండలంలోని యర్రారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన పోతన కేశవరావు(65) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం కేశవరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు బడే గంగాధరరావు, సోషల్ మీడియా కన్వీనర్ పోతన నాగరాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధిత హోంగార్డుకు ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: ఇటీవల జనసేన నాయకుడు కర్రి మహేష్ దాడిలో గాయపడిన హోంగార్డు గుజ్జు మోహన్‌రావుకు దళిత జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోహన్‌రావును జేఏసీ ప్రతినిధులు కలిసి రూ. 11,500లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత ఉద్యోగులపై రాజకీయ నాయకులు ఎవరైనా దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు(జానీ), నాయకులు బూరగ రామారావు, కె.చంద్రశేఖరరావు, భూపతి అంబేద్కర్, కోన నాగార్జున, డూండీ, సీనియర్ జర్నలిస్టులు కుంపటి జయకర్‌బాబు, ఏలేటి రాజేశ్వరరావు, అరిసె శ్రీహరి పాల్గొన్నారు.

పారదర్శకంగా సమిత్వ

గూడూరు: గ్రామాల్లో అనుభవంలో ఉన్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమిత్వ సర్వే పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు డీఎల్‌పీఓ మొహమ్మద్ రజావుల్లా తెలిపారు. మండలంలోని కప్పలదొడ్డిలో జరుగుతున్న రెండో విడత సమిత్వ సర్వేను గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. డ్రోన్ ద్వారా చిత్రీకరించిన మ్యాప్‌తో భౌగోళికంగా హద్దులు నిర్ధారించే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. సరిహద్దు వివాదాలకు ఆస్కారం లేకుండా క్షేత్రస్థాయిలో హద్దులు నిర్ధారించడాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. తద్వారా ఎలాంటి దస్తావేజులు లేని వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించడంలో తప్పిదాలు జరగవని పేర్కొన్నారు. వీఆర్వో గణేష్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, సర్వేయర్ చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉమాశివరావు పాల్గొన్నారు.

గూడూరులో ఫీవర్ సర్వే

గూడూరు: గూడూరు ఇందిరమ్మ కాలనీ పరిసరాల్లో గురువారం ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి విషజ్వరాలకు కారణమయ్యే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం అరుణాదేవి, ఆశ వర్కర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలోని వినాయకుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శివలింగానికి పాలతో అభిషేకం చేస్తున్న వినాయకుడు



అవనిగడ్డలో గణనాథునికి పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి



పూజలు చేస్తున్న కమిషనర్ బాపిరాజు దంపతులు

వచ్చాడయ్యో స్వామి..!

- భక్తిశ్రద్ధలతో ఊరూ వాడా వినాయక చవితి వేడుకలు
- విభిన్న రూపాల్లో దర్శనమిచ్చిన గణనాథుల విగ్రహాలు

కోడూరు: వినాయక చవితి పర్వదినాన్ని బుధవారం ఊరూ వాడా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రత్యేక పందిళ్లలో బొజ్జ గణపయ్య విగ్రహాలను నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లో సిద్ధిబుద్ధి సమేత వినాయకుడి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వివిధ రూపాల్లో ఉన్న గణనాథుల విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. లంబోదరుడికి ప్రతి ఇంటా పూజలు చేశారు. వినాయకుడి మట్టి ప్రతిమకు పూజలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. వివిధ రకాల పూలు, పండ్లతో పాలవల్లలను అలంకరించి, కుడుములు, ఉండ్రాళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వినాయక ఆలయాలను చవితి ఉత్సవాలకు నిర్వాహకులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బంటుమిల్లి: మండలంలో గ్రామగ్రామాన బుధవారం గణేష్ చతుర్థి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. పెదతుమ్మిడి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. అలాగే విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో మచిలీపట్నం ఎమరాల్డ్ ఆర్గానిక్ స్టోర్ నిర్వాహకులు సీతారామ్‌గారి సహకారంతో ఎకో ఫ్రండ్లీ మట్టితో బంటుమిల్లి, సాతులూరు, జయపురం గ్రామాల్లో మట్టి విగ్రహాలను అందజేశారు.

ఘనంగా వినాయక చవితి

పెడన: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడల బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పలు కూడళ్లలోను, దేవాలయాల్లోను వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసి పూజల తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. కొందరు మొదటి రోజునే వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

చల్లపల్లి: స్థానిక రైతు బజారులో ఎడమచేతితో గంట కొడుతూ కుడి చేతిలో ఉన్న శంఖులో నుంచి పాలు శివలింగంపై పోస్తూ అభిషేకం చేస్తున్నట్లు వినాయకుడిని ఏర్పాటు చేశారు. దీనిని ప్రత్యేకంగా తయారు చేయించినట్లు రైతుబజారు సిబ్బంది తెలిపారు.

68వ వార్షిక వేడుకలు

నాగాయలంక: నాగాయలంకలోని ప్రసిద్ధ ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన 68వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలను ఆనవాయితీ ప్రకారం బుధవారం అవనిగడ్డ డీఎస్పీ తాళ్ళూరి విద్యాశ్రీ ప్రారంభించారు. దేవస్థానంలో ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో ప్రసన్న గణపతికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ సీఐ పి.యువకుమార్, ఎస్ఐ కలిదిండి రాజేష్, దేవస్థానం కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు తదితరులు పాల్గొన్నారు.



కోడూరులోని స్వతంత్రపురంలో నంది వాహనంపై గణనాథుడు



ఇత్తడి వస్తువులతో గణనాథుని ప్రతిమ



నాగాయలంకలో చవితి ఉత్సవాల్లో డీఎస్పీ విద్యాశ్రీ

గ్రామ గ్రామాన గణేషుని విగ్రహాలు

మోపిదేవి: మండలంలోని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు జరిగాయి. మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక మందిరంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహానికి గురువారం వేద పండితులు పూజలు నిర్వహించారు. అలాగే కె.కొత్తపాలెం, బొబ్బర్లంక దళితవాడల్లో విశ్వహిందు పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను బసవ శంకరరావు పర్యవేక్షించారు.



పెడనలో నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళ్తున్న భక్తులు



బంటుమిల్లి పాత బస్టాండు సెంటర్‌లో గణనాథుడు

మచిలీపట్నంటౌన్: గణపతి నవరాత్రులను నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పందిరిలో కమిషనర్ బాపిరాజు దంపతులు పూజలు చేశారు. నగరంలోని చెమ్మనగిరి పేటకు చెందిన గోళ్ల ఝాన్సీ ఇత్తడి వంట సామగ్రితో గణనాథుని ప్రతిమను తయారు చేసి పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ: స్థానిక 6వ వార్డులో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చింతలపూడి బాలు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



ఘంటసాల: చవితి రోజున మతసామరస్యం వెల్లివిరిసింది. ఘంటసాల గ్రామంలో శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి ఆలయం వద్ద వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా బుధవారం గ్రామానికి చెందిన అక్బర్ బాషా, షర్మిల దంపతులు పీటలపై కూర్చుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ గతంలో అయ్యప్ప మాల కూడా వేశానన్నారు. గత కొన్నేళ్లుగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలనే కోరిక ఉండేదని, ఈ ఏడాది చవితి వేడుకల్లో తాను భాగస్వామిని కావడంతో పాటు కుటుంబ సమేతంగా మొదటి రోజు పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు.

కమనీయం.. గణనాథుడి కల్యాణం

కోడూరు: కోడూరులోని గొల్లపాలెం రోడ్డులో ఉన్న సిద్ధి బుద్ధి సమేత ప్రసన్న గణపతి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలను కనులపండువగా ప్రారంభించారు. చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని 58వ నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. బుధవారం స్వామివార్ల మూలమూర్తులకు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. ప్రత్యేక పందిరిలో భారీ లంబోదరుడి విగ్రహాన్ని నెలకొల్పారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పలువురు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి స్వామివార్ల కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. అలాగే గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చవితి వేడుకలకు పటిష్ట చర్యలు

పెడన: గణపతి నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ అన్నారు. గురువారం ఆయన పెడన పట్టణంలో ఏర్పాటు చేసిన పలు పందిళ్లను, గూడూరు మండలం చిన్న ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాల్లోని వినాయక మండపాలను సందర్శించారు. కమిటీ వారికి దిశానిర్దేశం చేస్తూ శాఖాపరంగా పూర్తిగా సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. కమిటీ వారు కూడా అంతే సహకారం అందించి నియమ నిబంధనలను పాటించాలని ఎస్పీ సూచించారు. మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వరరావు, పెడన, గూడూరు ఎస్ఐలు జి.సత్యనారాయణ, కేవీఎస్ సత్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెడనలో వినాయక చవితి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్

హోర్డింగులకు అనుమతి తప్పనిసరి

కోనేరుసెంటర్: బందరు సబ్ డివిజన్‌లో పండుగలకు సంబంధించి పబ్లిక్ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేసుకునే వారు పోలీస్, మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ చప్పిడి రాజా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండుగలను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

యూరియా సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు

కలెక్టర్ డీకే బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కె. చంద్రశేఖరరావు, ఏఎస్పీ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో యూరియా లభ్యతపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పరిస్థితులను వివరించారు. రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. అదేవిధంగా మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మార్క్‌ఫెడ్ డీఎం మురళీ కిషోర్, జెడ్పీ డెప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, డ్రెయినేజీ శాఖ ఈఈ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మచిలీపట్నంటౌన్: విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం మోపుతున్న భారాలను నిలిపివేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక నవకళా సెంటర్‌లో బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమ అమరుల జ్ఞాపకార్థం గురువారం ప్రతిజ్ఞ దినోత్సవం జరిపారు. మచిలీపట్నం వామపక్షాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బషీర్బాగ్ కాల్పుల్లో మరణించిన ఉద్యమ పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు


బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళి అర్పించారు. పలువురు సీపీఎం నాయకులు, రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో విద్యుత్ ఉద్యమ అమరవీరులకు గురువారం నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ రాజశేఖర్, మద్దాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీలో భజనచేసే వారికే పట్టం

చల్లపల్లి: అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలకు అడిగి పనులు చేయించుకోవడం రాదని టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మేకావారిపాలెం ఆర్‌కే కన్వెన్షన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో చల్లపల్లి టీడీపీ నాయకులు గ్రామ ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న కనపర్తి శ్రీనివాసరావు చుట్టూ భజన చేసి ఆయన మెప్పుతో నాయకులు పదవులు పొందుతున్నారని పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లేదని ఆరోపించారు. దీనికి సమాధానంగా శ్రీనివాసరావు పదవులు ఇచ్చే పని తనది కాదని దానికి పైవారున్నారని, తనది కేవలం పోస్టుమ్యాన్ ఉద్యోగమేనని పేర్కొన్నారు.

మోపిదేవి తహసీల్దార్‌గా హరినాథ్



మోపిదేవి: మండల తహసీల్దార్‌గా ఎం.హరినాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మచిలీపట్నం కలెక్టరేట్‌లో భూసేకరణలో ప్రత్యేక తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ శ్రీవిద్య సీసీఎల్ఏ కార్యాలయానికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు హరినాథ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



గూడూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కృష్ణాజిల్లా కార్యదర్శి కె.ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని తరకటూరు జెడ్పీ హైస్కూల్‌లో బాల్యవివాహాలు, చిన్నవయస్సులో కలిగే గర్భధారణ వల్ల నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్టీ వెల్ఫేర్ అధికారి ఫణి దూర్జటి, గూడూరు ఎస్ఐ సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం ఎస్.అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్స్ అందజేత

పులిగడ్డ(అవనిగడ్డ): వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పులిగడ్డ పంచాయతీ పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లకు కార్యదర్శి బి.అనిత ఆర్థిక సాయంతో రెయిన్ కోట్స్ అందించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ చేతుల మీదుగా వీటిని గ్రీన్ అంబాసిడర్స్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాడుకుని వదిలేస్తారా?

జనసేన మండల కమిటీపై నేతల ఆగ్రహం



జనసేన నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖరరావు

తలగడదీవి(నాగాయలంక): ఎన్నికల వరకు మమ్మల్ని వాడుకుని అధికారం వచ్చాక పట్టించుకోకుండా వదిలేస్తారా అంటూ జనసేన నాగాయలంక మండల కమిటీపై తలగడదీవికి చెందిన ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కాపునాడు నియోజకవర్గ నాయకులు గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. నాగాయలంక మండలంలో ఎమ్మెల్యే గెలుపు కోసం తాము తీవ్రంగా శ్రమించామని తీరా గెలిచాక మమ్మల్ని ఏ కార్యక్రమానికి పిలవకుండా కరివేపాకులా తీసేశారని వైస్ ప్రెసిడెంట్ వర్రే శివనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సొసైటీని నాగాయలంకలో కలపడంతో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి సంఘాలు, బ్యాంకు కమిటీల నియామకాల్లో తమ గ్రామానికి తీవ్ర అన్యాయం జరిగిందని జనసేన నాయకుడు భోగాది శివరామకృష్ణప్రసాద్ తెలిపారు. అక్రమ రేషన్ బియ్యంపై ఫిర్యాదు చేసినందుకు జనసేన మండల ముఖ్యనేత ఒకరు తన పొలంలోని షెడ్డులో 38 మినుము బస్తాలు దొంగిలించి 24 రేషన్ బస్తాలు అక్కడ పెట్టించి తనను ఇరికించారని కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడు భోగాది సోమశేఖరరావు పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్, జేసీకి ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ విషయాలన్నింటినీ గుర్తించి తమ గ్రామంలోని జనసేన నాయకుల పట్ల జరుగుతున్న నిర్లక్ష్యాన్ని అరికట్టేలా చూడాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉమ్మారెడ్డి నానారావు, వార్డు సభ్యుడు పేర్ల మునలయ్య పాల్గొన్నారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీకాకుళం(ఘంటసాల): పోలీసు, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో శ్రీకాకుళంలో వినాయకుని విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం వద్ద కృష్ణానదిలోకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రోడ్డును చదును చేయడంతో పాటు రహదారికి ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలను జేసీబీతో గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో శ్రీకాకుళం వద్ద నదిలో విగ్రహాలు నిమజ్జనం చేసేవారు పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు.